నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 15 జూన్ 2024 | HYDERABAD




ఆటో, క్యాబ్ డ్రైవర్లతో సమావేశమైన వోల్టా ప్రతినిధులు



షేక్‌పేట దర్గా రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలు

## మరో అగ్రిగేటర్ 'వోల్టా'

సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : యాప్ అగ్రిగేటర్స్ సరసన మరో అగ్రిగేటర్ 'వోల్టా' నగరంలో కార్యకలాపాలను ప్రారంభించింది. మిగిలిన యాప్ అగ్రిగేటర్స్ కంటే తక్కువ చార్జీలతో రైడ్ సదుపాయం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంపెనీ ఎలాంటి కమీషను డ్రైవర్ల నుంచి వసూలు చేయకుండా నేరుగా రైడ్ అప్పగిస్తామన్నారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని క్యాబ్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లతో వోల్టా కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. వోల్టా సీఈఓ రాజా విక్రం, వ్యవస్థాపకుడు శశికాంత్ కనపర్తి డ్రైవర్లతో చర్చించి యాప్‌పై అవగాహన కల్పించారు. అంతేకాదు డ్రైవర్లకు ఇన్సూరెన్స్, మెరుగైన భద్రతా చర్యలు, డిజిటల్ మీటర్, ఆదాయం పెంచుకోవడంపై అవకాశం ఇస్తామని పేర్కొన్నారు. గత నాలుగు నెలల నుంచి వోల్టా నగరంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టింది. 30వేల కస్టమర్లను తమ గమ్యస్థానాలకు చేర్చామని తెలిపింది. త్వరలో వోల్టాను గ్రాండ్‌గా లాంచ్ చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. www.voltacabs.com లేదా ప్లే స్టోర్‌లో వోల్టా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

## నేటి నుంచి గోదావరి ఎత్తిపోతలు

### ఎల్లంపల్లి నుంచి 168 ఎంజీడీల తరలింపు

సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : గోదావరి జలాలను ఎత్తిపోసి నగరానికి నీరందించేందుకు జలమండలి సిద్ధమైంది. శనివారం నుంచి ఎల్లంపల్లి నుంచి ఐదు పంపుల ద్వారా జలాలను ఎత్తిపోసి నగరానికి 168 ఎంజీడీల మేర నీటిని అందించనున్నారు. నాగార్జున సాగర్ నుంచి కృష్ణా జలాలను అత్యవసర పంపింగ్ ద్వారా నగరానికి రోజూ 270 ఎంజీడీలను తరలిస్తున్నట్లుగానే ...నగర దాహార్తిలో మరో ముఖ్యమైన గోదావరి జలాల తరలింపులోనూ ఎమర్జెన్సీ పంపింగ్ అనివార్యమైంది. గతేడాది వర్షాభావ పరిస్థితులతో రెండు నెలలుగా కృష్ణా జలాలను ఎత్తిపోస్తూ రోజూ మూడు దశల్లో 270 ఎంజీడీల నీటిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో గోదావరి జలాల తరలింపులో ఎల్లంపల్లి రిజర్వాయర్ నీటి నిల్వలు వేగంగా అడుగంటుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనా.. కడెం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లిలోకి వరద నీరు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఎల్లంపల్లిలో నీటి నిల్వలు 4.5 టీఎంసీల మేర ఉండగా, ముందస్తుగానే అప్రమత్తమైన జలమండలి అధికారులు ఎల్లంపల్లి రిజర్వాయర్ బ్యాక్ చానల్ ముర్మూర్ ఫోర్‌సోర్ వద్ద అత్యవసర పంపింగ్ మోటర్లను ఏర్పాట్లు చేశారు. రెండు రోజులుగా ఐదు పంపులను సిద్ధం చేసి.. ట్రయల్ రన్ చేపట్టారు. శనివారం నుంచి ఒక్కో పంపు నుంచి 25 క్యూసెక్కుల మేర తొలుత ఎత్తిపోసి యథావిధిగా గోదావరి జలాలను అందించి తాగునీటి కొరత లేకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# ఈ నగరానికి ఏమైంది?

## ఒకే రోజు మూడు హత్యలు

### బస్సు దిగబోయి విద్యార్థిని మృతి

ఆసిఫ్‌నగర్, బాలాపూర్‌లో యువకులు..

చందానగర్‌లో వివాహిత దారుణ హత్య

యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద

ఆర్టీసీ బస్సు కిందపడి.. ఇంటర్ విద్యార్థిని దుర్మరణం

*నగరంలో వేర్వేరు చోట్ల జరిగిన ఘటనలు.. కలవరపాటుకు గురిచేశాయి. ఒకే రోజు మూడు హత్యలు జరగడంతో నగరవాసులు భయాందోళనలకు గురయ్యారు. ఆసిఫ్‌నగర్, బాలాపూర్‌లో యువకులు, చందానగర్‌లో వివాహితను హతమార్చారు. యూసుఫ్‌గూడ చెక్ పోస్ట్ కూడలి వద్ద కదులుతున్న బస్సు నుంచి దిగబోయి..ఓ ఇంటర్ విద్యార్థిని దుర్మరణం పాలైంది.*

మెహిదీపట్నం: నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే ఓ యువకుడిని కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. ఏసీపీ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌లో నివసించే ముజాహిద్ గతేడాది ఆగస్టు 27న హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఆసిఫ్‌నగర్‌లో నివసించే అబ్దుల్ ఖుద్దూస్ (27) కూడా ఉన్నాడు. ఈ నేపథ్యంలో ముజాహిద్ సోదరులు గురువారం అర్ధరాత్రి సమయంలో ఆసిఫ్‌నగర్ క్రాస్ రోడ్ సమీపంలో ఖుద్దూస్ వెంటపడి.. దాడి చేసి పారిపోయారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన ఖుద్దూస్‌ను ఉస్మానియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున అతడు మృతి చెందాడు.







మసీరా మెహరీన్



విజయలక్ష్మి



సమీర్



ఖుద్దూస్

## గొంతు కోసి..

కొండాపూర్: చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత హత్యకు గురైంది. ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రం సేడం ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి(32), కుటుంబంతో కలిసి వలస వచ్చి.. నగరంలోని నల్లగండ్ల లక్ష్మి విహార్ ఫేజ్ –1లో నివాసముంటూ స్థానిక అపర్ణ టవర్స్‌లో వంట మనిషిగా పని చేస్తూ.. భర్త, ఇద్దరు కుమారులతో కలిసి ఉంటున్నది. శుక్రవారం మధ్యాహ్నం దుండగుడి చేతిలో దారుణ హత్యకు గురైంది. హంతకుడు లింగంపల్లికి చెందిన ఆటోడ్రైవర్ భరత్ అలియాస్ శ్రీనివాస్‌గౌడ్‌గా గుర్తించారు. మృతురాలి సోదరుడు సునీల్ శ్రీనివాస్ గౌడ్ నుంచి ఫైనాన్స్ తీసుకున్నాడని, ఆ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగి పోలీసు కేసు వరకు వెళ్లగా, ఇటీవలే లోక్ అదాలత్‌లో కేసును ఉపసంహరించుకున్నట్లు సమాచారం. ఈక్రమంలో శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోకి చొరబడి కత్తితో విజయలక్ష్మి గొంతు కోసి చంపేశాడు. హత్యకు గల కారణాలపై వివిధ కోణాల్లో విచారిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి తెలిపారు. కాగా, హంతకుడు శ్రీనివాస్‌గౌడ్ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.



ఆసిఫ్‌నగర్‌లో నడిరోడ్డుపై యువకుడిపై కత్తులతో దాడి చేస్తున్న దృశ్యం

## మాట్లాడుదామని పిలిచి..

బడంగ్‌పేట, జూన్ 14: మాట్లాడుదామని పిలిచి.. ఓ యువకుడిని దారుణంగా చంపేశారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం హఫీజ్‌నగర్‌కు చెందిన మహ్మద్ మున్నీర్ కుమారుడు మహ్మద్ సమీర్(19) డెకరేషన్ పనులు పని చేస్తుంటాడు. సమీర్ తన ఇంట వద్ద ఉన్న మహిళ కోసం తరచుగా ఓ యువకుడు వస్తున్న విషయాన్ని గమనించాడు. ఇక్కడికి రావద్దని సమీర్ హెచ్చరించాడు. ప్రతి దానికీ అడ్డు తగులుతున్న సమీర్‌పై ఆ యువకుడు కక్ష పెంచుకున్నాడు. తన స్నేహితులతో కలిసి సమీర్‌ను హత్య చేయాలని ప్లాన్ వేశాడు. ఐదుగురు యువకులు కలిసి హఫీజ్‌నగర్‌లో ఉన్న సమీర్‌కు ఫోన్ చేసి మాట్లాడుకుందామని పిలిచారు. రాయల్ కాలనీ గుర్రం చెరువు దగ్గరకు రావాలని చెప్పడంతో వారు చెప్పినట్లుగానే సమీర్ అక్కడికి చేరుకున్నాడు. అప్పటికే కాపు కాసి ఉన్న ఐదుగురు సమీర్‌పై కత్తులతో దాడి చేసి పారిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, బాలాపూర్ సీఐ భూపతితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాణాలతో కొట్టు మిట్టాడుతున్న సమీర్‌ను వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గమధ్యలో చనిపోయాడు. కేసు దర్యాప్తులో ఉంది.

## అయ్యో..అక్క ఎక్కలేదు

వెంగళరావునగర్, జూన్ 14 : అక్క బస్సు ఎక్కలేదని.. కదులుతున్న బస్సు నుంచి కిందకు దిగబోయిన ఓ ఇంటర్ విద్యార్థిని.. చక్రాల కిందపడి దుర్మరణం పాలైంది. అయితే బస్సును ఆపమన్నా.. ఆపలేదని.. తన చెల్లి ప్రాణాలు పోవడానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని మృతురాలి అక్క కన్నీటిపర్యంతమైంది. ఈ విషాద ఘటన యూసుఫ్‌గూడ చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం..బోరబండ సఫ్దర్‌నగర్‌కు చెందిన దినసరి కూలీ ఎండీ సలీం, ఆరిఫా సుల్తానా దంపతులకు ఐదుగురు సంతానం. నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లు జువేరియా(17), మసీరా మెహరీన్(16) యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న ఓ కాలేజీలో చదువుతున్నారు. మసీరా మెహరీన్ ఇంటర్ మెదటి సంవత్సరం సీఈసీ చదువుతున్నది. అక్కాచెల్లెళ్లు ఇద్దరూ కలిసి శుక్రవారం కాలేజీకి వెళ్లారు. క్లాసులు ముగిశాక.. ఇంటికి వెళ్లేందుకు కాలేజీ సమీపంలోని బస్టాప్ వద్దకు తోటి స్నేహితులతో కలిసి వచ్చారు. అంతలో కేపీహెచ్‌బీ డిపోకు చెందిన సికింద్రాబాద్ నుంచి బోరబండ వెళ్లే 10వై రూట్ నంబర్ బస్సు వచ్చి ఆగింది. అప్పటికే ప్రయాణికులతో బస్సు రద్దీగా ఉంది. మసీరా మెహరీన్ బస్సు ఎక్కగా.. ఆమె అక్క జువేరియా బస్సు ఎక్కలేకపోయింది. అక్క ఎక్కలేదు..బస్సు ఆపండంటూ.. మెహరీన్ డ్రైవర్‌కు చెప్పినా..అతను వినిపించుకోలేదు. బస్సు యూసుఫ్‌గూడ మలుపు వద్దకు వచ్చేసరికి..మసీరా మెహరీన్ బస్సు నుంచి కిందకు దూకేసింది. కిందపడిన మెహరీన్‌ను చూసిన తోటి స్నేహితులు బిగ్గరగా కేకలు వేసినా.. డ్రైవర్ గోవింద్ పట్టించుకోలేదని సోదరి ఆరోపిస్తున్నది. కింద పడ్డ మెహరీన్ తల పై నుంచి బస్సు ముందు, వెనుక టైర్లు వెళ్లిపోయాయి. దీంతో మెహరీన్ అక్కడికక్కడే మృతి చెందింది. కళ్లెదుటే చెల్లి బస్సు చక్రాలు కింద నలిగి ప్రాణాలు కోల్పోవడంతో జువేరియా నిర్ఘాంతపోయి గుండెలవిసేలా రోదించింది. సమాచారం అందుకున్న మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి, క్లూస్ టీంతో ఘటనాస్థలానికి చేరుకున్నారు. మెహరీన్ మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### డ్రైవర్ నిర్లక్ష్యంతోనే: మృతురాలి అక్క జువేరియా

నేను బస్సెక్కలేకపోయిన విషయాన్ని గ్రహించిన చెల్లెలు మసీరా మెహరీన్ బస్సును ఆపాలని డ్రైవర్‌ను అనేకసార్లు కోరింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా ఉండటంతో..చెల్లి మసీర మెహరీన్ నా కోసం బస్సు నుంచి రోడ్డు పైకి దూకింది. ఇది చూసి బిగ్గరగా కేకలు వేశా. బస్సు కింద చెల్లి పడి ఉందని అర్తనాదాలు చేసినా..డ్రైవర్ వినిపించుకోలేదు. యూసుఫ్‌గూడ నిమ్స్‌మేకు వెళ్లే మలుపు వద్ద వేగంగా అజాగ్రత్తలో నడిపి... చెల్లి ప్రాణాలు పోవడానికి డ్రైవరే కారణం. చెల్లి కింద రోడ్డు పై పడిన వెంటనే డ్రైవర్ బస్సు సడన్ బ్రేక్ వేసి ఆపితే..చెల్లి ప్రాణాలు దక్కేవి.



బస్సు చక్రాల కిందపడి మృతిచెందిన విద్యార్థిని



## అర్ధరాత్రి..మత్తు బ్యాచ్ హల్‌చల్


### ఓ వ్యక్తిపై విచక్షణా రహితంగా దాడి

#### సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో.. ఏడుగురి అరెస్టు

సిటీబ్యూరో: నగరంలో గంజాయి, మద్యం మత్తులో యువకులు చెలరేగిపోతున్నారు. ఇష్టానుసారంగా దాడులకు తెగబడుతున్నారు.. సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి జరిగిన మూకదాడి దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. మత్తులో ఆ యువకులు అర్ధరాత్రి వీరంగం చేస్తుంటే.. ఇదేంటని అడిగిన పాపానికి ఓ వ్యక్తిని దారుణంగా కొట్టారు. సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నేతాజీనగర్‌లో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకున్నది. చైతన్యపురి మెట్రో స్టేషన్‌కు సమీపంలోని నేతాజీనగర్‌లోని రోడ్డుకు ఒకవైపు ఖాళీ స్థలంలో అర్ధరాత్రి 2 గంటల సమయంలో శంకు యాదవ్, వంశీ, షాహిద్, హరీశ్, సోను, సుమన్ మరికొందరు ఖాళీ స్థలంలో కూర్చొని.. న్యూసెన్స్ చేస్తున్నారు. స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలను గట్టిగా అరుస్తూ..న్యూసెన్స్ చేస్తుండటంతో ఎదురుగా ఉండే ఓ వ్యక్తి వచ్చి న్యూసెన్స్ చేయవద్దని, అలా చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటూ హెచ్చరించాడు. వాళ్ల ఫొటోలు తీసుకొని వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తరువాత ఆ యువకులు ఎదురింటిపై రాళ్లు విసురుతూ హంగామా చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. ఆ ఇంట్లో కిరాయికి ఉన్న వాళ్లు ఎవరూ బయటకు రాలేదు. భయంతో లోపలే ఉండిపోయారు. అయితే ఇంటి యజమాని జనార్దన్‌నాయుడుకు ఫోన్ చేసి ఇంటిపై కొందరు రాళ్లు విసిరి అద్దాలు పగులగొడుతున్నారంటూ సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే జనార్దన్‌నాయుడు ఘటనాస్థలికి చేరుకొని తన ఇంటిపై జరిగిన దాడి, ధ్వంసమైన అద్దాలను పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో జనార్దన్ వద్దకు వచ్చిన యువకులు.. ఇష్టానుసారంగా ఆయనపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని బాధితుడిని 108లో చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు. ఆ యువకులు మద్యం మత్తులో ఉన్నారని, గంజాయి తీసుకోలేదని సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి చెబుతున్నారు. కేసు నమోదు చేసి ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామని, నిందితులకు కోర్టు రిమాండ్ విధించిందని వెల్లడించాడు.

## డ్రోన్‌లతో ట్రాఫిక్ పర్యవేక్షణ

### సైబరాబాద్ పోలీసుల వినూత్న ఆలోచన



సిటీబ్యూరో: టెక్నాలజీని వాడుకోవడంలో సైబరాబాద్ పోలీసులు మరో ముందడుగు వేశారు. ప్రస్తుతం కమిషనరేట్ పరిధిలో సవాలుగా మారిన ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు వినూత్న రీతిలో డ్రోన్ కెమెరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ డ్రోన్‌ల సహకారంతో ఎక్కడైనాట్రాఫిక్ స్తంభిస్తే..ఆ ప్రదేశానికి వెంటనే డ్రోన్ కెమెరాలను పంపించి అక్కడి పరిస్థితులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలిస్తారు. అదే సమయంలో సంబంధిత ట్రాఫిక్ సిబ్బందిని సమస్య ఉన్న ప్రదేశానికి పంపించి.. పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటారు. అలాగే అసలు ట్రాఫిక్ స్తంభించడానికి గల కారణాలపై ప్రత్యేక దృష్టి పెడతారు. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సొసైటీ ఫర్ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో ట్రాఫిక్ పర్యవేక్షణ కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ డ్రోన్ కెమెరాలను వారం రోజుల కిందట అందుబాటులోకి తీసుకురాగా, సత్ఫలితాలిస్తున్నట్లు సైబరాబాద్ జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ వెల్లడించారు.



## ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తాం

### వర్షాకాల ప్రణాళిక అమలుపై జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి



సిటీబ్యూరో: వర్షాకాలంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు, పర్యవేక్షించేందుకు జలమండలి కమాండ్ కంట్రోల్ రూం 24 గంటలు పనిచేస్తుందన్నారు. ప్రత్యేకంగా నీరు నిలిచే 125 హాట్‌స్పాట్స్ గుర్తించామని, ఇందుకు మూడు షిఫ్టుల్లో సిబ్బంది పనిచేస్తారని ఎండీ చెప్పారు. వర్షాకాల ప్రణాళిక, అమలుపై శుక్రవారం ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎండీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. మూడు షిఫ్టులు, 24 గంటలు క్షేత్రస్థాయిలో పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయని, జీహెచ్‌ఎంసీ కోర్ సిటీతో పాటు శివార్లలోనూ బృందాలు పర్యటిస్తాయని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వర్షాకాలంలో జలమండలి ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం (ఈఆర్టీ) బృందాలను రంగంలోకి దింపామని, 16 ఎమర్జెన్సీ బృందాల్లో ఒక్కో బృందంలో ఐదుగురు ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సత్యనారాయణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

**నేడు 'డయల్ యువర్ ఎండీ'**

జలమండలిలో 'డయల్ యువర్ ఎండీ' శనివారం నుంచి పునః ప్రారంభం కానున్నది. ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎండీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనున్నదని అధికారులు తెలిపారు. కొవిడ్ కంటే ముందు ప్రతి నెలా మూడో శనివారం 'డయల్ యువర్ ఎండీ' కార్యక్రమం జరిగేది.

## లక్ష్యం చేరి..

### గ్రేటర్ ఆర్టీసీకి రూ. 34.91 కోట్ల ఆదాయం

సిటీబ్యూరో: గ్రేటర్ ఆర్టీసీ.. నిర్దేంచిన లక్ష్యాన్ని అధిగమించి పరుగులు తీస్తున్నది. రెండు వారాల టార్గెట్‌లో భాగంగా 25 డిపోలకు రూ. 34.79 కోట్లు నిర్దేశించగా.. 34.91 కోట్లను రాబట్టింది. మహాలక్ష్మి పథకం టికెట్లు కాకుండా మిగిలిన టికెట్లు, బస్సు పాసులు, ప్రత్యేక పాసులు తదితర వాటితో ఆర్టీసీ ఈనెల 13 వరకు 34.91 కోట్లను వసూలు చేసింది. అంతేకాదు రూ. 12 లక్షలు అధికంగా సమకూరింది. దీంతో గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఆర్టీసీ సిబ్బందిని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ప్రశంసించారు. కాగా, విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో లక్షలాది మంది విద్యార్థులు పాసులు తీసుకుంటున్నారు. నగరంలోని కాలేజీల వద్ద మొబైల్ పాస్ కౌంటర్లు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. ప్రత్యేక రాయితీలతో పాస్‌లు జారీ చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ ఖజానా గలగలమంటున్నది. అత్యధికంగా ఎస్‌ఆర్‌నగర్ రీజియన్‌లో రూ. 18.44 కోట్లు ఆదాయం సమకూరినట్టు అధికారులు పేర్కొన్నారు.



**వెడ్డింగ్ ప్లానింగ్ అదుర్స్** | మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం తెలంగాణ చాంబర్స్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ 3వ ఎడిషన్ అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డెకరేషన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.